## క్లుప్తంగా

### వ్యక్తిగత పర్యటనలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా వ్యక్తిగత పర్యటనకు పయనమయ్యారు. ఈ కారణంగా ఈ నెలాఖరు వరకు ఆయన అందుబాటులో ఉండరు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి నియోజక వర్గ ప్రజలందరికీ అందుబాటులో ఉంటారని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా, ఏ అవసరం ఉన్నా 99852 55555, 98663 55655 నంబర్లను సంప్రదించాలని కోరారు.

### సప్లిమెంటరీ పరీక్షకు పది మంది గైర్హాజరు

రంగంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షకు పది మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ బి.హేమ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శుక్రవారం ఉదయం జరిగిన మొదటి సంవత్సరం తెలుగు, సంస్కృతం పరీక్షకు 69 మంది విద్యార్థులకు 61 మంది, మధ్యాహ్నం జరిగిన రెండో సంవత్సరం తెలుగు పరీక్షకు 11 మందికి గాను 9 మంది హాజరయ్యారని వివరించారు.

**ఇంటర్ పరీక్షలకు 29 మంది హాజరు**

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జరిగిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 29 మంది విద్యార్థులు (ఫస్టియర్ 23 మంది, సెకండియర్ ఆరుగురు) హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ ఏఎస్ శేఖర్‌బాబు, అసిస్టెంట్ చీఫ్ సూపరింటెండెంట్ కేవీ రమణ తెలిపారు. ఫస్ట్ ఇయర్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకూ, సెకండియర్ పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయన్నారు.

### టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

సీతానగరం: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు రఘుదేవపురం, వెదుళ్లపల్లి హైస్కూళ్లలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని ఎంఈవో కె.స్వామి నాయక్ తెలిపారు. రఘుదేవపురంలో 54 మందికి 29 మంది, వెదుళ్లపల్లిలో 51 మందికి 26 మంది హాజరయ్యారన్నారు. ఈ నెల 30వ తేదీ వరకూ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయన్నారు.

### రౌడీయిజం చేస్తే కఠిన చర్యలు

ధవళేశ్వరం: రౌడీయిజం చేస్తే సహించేది లేదని దక్షిణ మండల డీఎస్పీ అంబికా ప్రసాద్ హెచ్చరించారు. రౌడీషీటర్లు, బ్లేడ్ బ్యాచ్‌ల ఆగడాలను ఉపేక్షించేది లేదన్నారు. ఈనెల 21వ తేదీన ఇందిరా కాలనీకి చెందిన యువకుడు కంచర్లలైన్ మరిడమ్మ గుడి దగ్గర ఉండగా అదే ప్రాంతానికి చెందిన రంగాల దుర్గా సాయి (పులి) వచ్చి రూ.500 ఇవ్వాలని డిమాండ్ చేశాడన్నారు. ఇవ్వకపోవడంతో బ్లేడ్ చూపించి చంపేస్తానని బెదిరించి రూ.వెయ్యి, సెల్‌ఫోన్‌ను బలవంతంగా లాక్కొని వెళ్లిపోయాడన్నారు. దీనిపై యువకుడు ఫిర్యాదు చేయడంతో ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు వేగవంతంగా దర్యాప్తు చేపట్టి రంగాల దుర్గాసాయిని అరెస్ట్ చేశామన్నారు. కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించారన్నారు. రంగాల దుర్గాసాయిపై గతంలోనే ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో మూడు కేసులు ఉన్నాయన్నారు. అతడిపై రౌడీ షీట్ తెరుస్తామన్నారు. రౌడీషీటర్లు, బ్లేడ్ బ్యాచ్‌లు దౌర్జన్యాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. దీనిపై ఇప్పటికే సీఐలకు, ఎస్సైలకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని డీఎస్పీ తెలిపారు.

### కలెక్టర్‌కు నర్సరీ రైతుల వినతి



కలెక్టర్ మాధవీలతకు వినతిపత్రం అందజేస్తున్న పోలరాజు తదితరులు

కడియం: నర్సరీ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు ఆధ్వర్యంలో రైతులు శుక్రవారం కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలతకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ కారణంగా బంకుల్లో పెట్రోల్, డీజిల్‌ను టిన్నుల్లో నింపేందుకు నిరాకరిస్తున్నారన్నారు. దీంతో నీటిని తోడే ఇంజిన్లు, మందుల పిచికారీకి వాడే స్ప్రేయర్లను ఉపయోగించడం కష్టంగా మారిందన్నారు. నర్సరీ రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేసి పెట్రోలు, డీజిల్ లభించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని పోలరాజు స్థానిక విలేకరులకు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో గాద నాగేశ్వరరావు, వడ్లమూరి రాజేష్ ఉన్నారు.

### 31న మేరీమాత ఉత్సవం

మధురపూడి: రాజమహేంద్రవరంలోని గోదావరి విచారణ దేవాలయంలో మే 31వ తేదీన క్రైస్తవుల సహాయమాత పండగను నిర్వహించనున్నట్టు ఆర్‌సీఎం రెవరెండ్ ఫాదర్ మనోజ్ కుమార్ తెలిపారు. కోరుకొండ మండలం బూరుగుపూడిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఏటా నిర్వహిస్తున్న తరహాలోనే మేరీమాత పండగ జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 22న మొదలైన నవదిన ప్రార్థనలు 30 వరకూ జరుగుతాయన్నారు. గడచిన సంవత్సరమంతా కాపాడినందుకు కృతజ్ఞతా ప్రార్థనలు చేస్తారని, చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు.

# మంట పెట్టేస్తున్నారు..

- పొలాల్లో గడ్డికి నిప్పు
- వద్దంటున్న అధికారులు



పందలపాకలోని వరి పొలంలో పెట్టిన మంట

బిక్కవోలు: వరి కోతలు పూర్తయ్యాక పంట పొలాలకు నిప్పు పెడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఒకపక్క మండే ఎండలకు తోడు పొలాల్లో మంటలు మరింత కాక పుట్టిస్తున్నాయి. ఇవే ఒక్కోసారి ప్రమాదాలకు దారితీస్తున్నాయి. మెషీన్ల పుణ్యమా అని వరి కోతలు త్వరగా పూర్తి చేసిన రైతులు ధాన్యాన్ని రాశులుగా పొలాలు, గట్లపై నిల్వ చేస్తున్నారు. కొంతమంది రైతులు అవగాహనా రాహిత్యంతో పొలాల్లో మిగిలిన గడ్డికి నిప్పు పెడుతుండడం పరిసర రైతులకు శాపంగా మారింది. ఒక పొలంలో పెట్టిన నిప్పు సమీప పొలాలకు వ్యాపిస్తుండడంతో ఆ పొలాలు, చేల గట్టుపై నిల్వ చేసిన ధాన్యం రాశులకు నిప్పు ఎక్కడ అంటుకుంటుందోనని సర్వత్రా ఆందోళన నెలకొంటోంది. ఇలాంటి ఘటనల సమయంలో ఉరుకులు, పరుగులతో ధాన్యపు రాశులను నీటితో తడుపుకొంటున్నారు.

**తరచూ ప్రమాదాలు..**

గతంలో ఎన్నడూలేని విధంగా ఎండలు మండిపోతున్నాయి. ప్రస్తుతం 36 నుంచి 42 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. విపరీతమైన వడగాడ్పుల నేపథ్యంలో ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ప్రజలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. పొలాల్లో మంటలతో గడ్డి వాములు కాలిపోయి రైతులకు నష్టం మిగులుతోంది. పశువులకు మేత దొరకని పరిస్థితి ఏర్పడుతుంది. అనపర్తి నియోజకవర్గంలో 52 వేల ఎకరాల్లో వరి పంట పండించారు. కోతలు పూర్తయ్యాయి. చేలల్లో మిగిలిన గడ్డికి రైతులు నిప్పు పెడుతున్నారు. భారీగా పొగ ఆవరించి ఆ వేడికి స్థానిక నివాసాల వారు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఒకవైపు ఎండల తీవ్రత అధికమవుతుండటం, గడ్డికి నిప్పు పెడుతుండటంతో గ్రామాల్లో భరించలేని వేడి వస్తోంది.



ఊలపల్లిలో కాలిన గడ్డితో వరి పొలం

**గతంలో జరిగిన ఘటనలు**

గతంలో బిక్కవోలు మండలంలో కోతల అనంతరం వరి చేలకు నిప్పు పెట్టడంతో సమీపంలోని గడ్డివామి కాలిపోయి రూ.20 వేల నష్టం వాటిల్లింది. సరైన సమయనికి అగ్నిమాపక సిబ్బంది వచ్చి ప్రమాదం నుంచి తప్పించారు. లేకుంటే ఈ మంటలకు చుట్టుపక్కల గడ్డివాములు తగలబడి రైతులు నష్టపోవాల్సి వచ్చేది. గత ఏడాది నియోజకవర్గంలో సుమారు 22కి పైగా ప్రమాదాలు రైతులు పొలాల్లో నిప్పు పెట్టిన కారణంగా సంభవించాయని అగ్నిమాపక అధికారులు చెబుతున్నారు.

**పచ్చదనం కనుమరుగు**

కొందరి అనాలోచిత చర్యలతో రహదారి పక్కన ఉన్న మొక్కలూ దగ్ధమవుతున్నాయి. పొలాల్లోని వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో విలువైన మొక్కలు బుగ్గిపాలవుతున్నాయి. ఏటా మొక్కలు నాటుతున్నా సంరక్షణ లేక కొన్ని చనిపోతున్నాయి. మంటలతో మరికొన్ని మొక్కలు కాలిపోవడంతో పచ్చదనం కనుమరుగవుతోంది. పొలాల్లోని వ్యర్థాలకు నిప్పు పెట్టకుండా కుళ్లబెడితే సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

**మిత్ర పురుగులు నాశనం**



పంట పొలాల్లో కోతల అనంతరం గడ్డి తగ్గలబెట్టడం వల్ల అపకారం చేసే సూక్ష్మజీవులతో పాటు మేలు చేసే మిత్ర పురుగులూ నాశనం అవుతాయి. కోతలు కోసిన తరువాత గడ్డిని వెదజల్లి నీరు పెట్టడం వల్ల గడ్డి మొత్తం కుళ్లిపోయి పొలానికి మంచి సేంద్రియ ఎరువుగా మారుతుంది. అందువల్ల రైతులు పంట పొలాల్లో గడ్డిని తగ్గలబెట్టవద్దు.

–శామ్యూల్ జాన్, ఏఓ, బిక్కవోలు

### నేడు విద్యుత్ అంతరాయం

మధురపూడి: కోరుకొండ సబ్‌స్టేషన్ పరిధిలోని కోరుకొండ టౌన్, నరసింహ ఫీడర్లలో మరమ్మతు పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కోరుకొండ, పశ్చిమగానుగూడెం, జంబూపట్నం, కాపవరం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

### మాచరమ్మ తీర్థం రేపు



పెదపూడి: స్థానికంగా మాచరమ్మవారి తీర్థ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించనున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా ప్రసిద్ధి చెందిన మాచరమ్మ తీర్థానికి మండలం నలుమూలల నుంచి వేల సంఖ్యలో భక్తులు హాజరవుతారు. శనివారం జాతర సందర్భంగా ప్రత్యేక గరగ నృత్యాలు, బ్యాండ్ మేళాలు, బాణసంచా కాల్పులు ఉంటాయి. ఆలయంలో అమ్మవారి దర్శనానికి మూడు ప్రత్యేక క్యూలైన్‌లు నిర్మించారు. ఆలయం ఎదురు ప్రాంగణంలో భక్తులు వేచి ఉండడానికి ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించనున్నారు.

## 'నన్నయ'కు రూరల్ పోస్టల్ బ్యాలెట్ల తరలింపు



స్ట్రాంగ్ రూమ్‌కి పోస్టల్ బ్యాలెట్లను తరలిస్తున్న సిబ్బంది, చిత్రంలో జేసీ తేజ్‌భరత్ తదితరులు

రాజానగరం: రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్లను ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలోని స్ట్రాంగ్‌రూమ్‌కి భద్రంగా తరలించామని ఆ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ తెలిపారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈ నియోజకవర్గం నుంచి పోలైన 3,033 పోస్టల్ బ్యాలెట్లను ఇంత వరకూ బొమ్మూరులోని న్యాక్ భవనంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో ఉంచారు. శుక్రవారం అక్కడ నుంచి సంబంధిత రాజకీయ నాయకుల సమక్షంలో పోలీసు బందోబస్తు నడుమ నన్నయ వర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్‌కి తరలించారు. కార్యక్రమంలో కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్.కృష్ణ నాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎం.భానుప్రకాష్, డీటీ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు



మాబ్‌డ్రిల్‌లో భాగంగా ఆందోళనకారులపై లాఠీలు ఝుళిపిస్తున్న కేంద్ర పోలీసు బలగాలు

అనపర్తి: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో శాంతిభద్రతల పరిక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ పి.శివగణేష్ తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం గ్రామాల్లో నేర, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణే లక్ష్యంగా శుక్రవారం స్థానిక దేవీచౌక్ సెంటర్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోలీసులు, ఆర్మ్‌డ్ రిజర్వ్, కేంద్ర బలగాలు మాబ్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా అవాంఛనీయ, హింసాత్మక ఘటనలు జరిగినప్పుడు, గుంపులు, గుంపులుగా వచ్చేవారిని నియంత్రించేందుకు చేసే హెచ్చరికలు పోలీసులు స్పందించే తీరు, చేపట్టే చర్యలను ప్రత్యక్షంగా ప్రజలకు చూపించారు. అదేవిధంగా పోలీసుల హెచ్చరికలను ఖాతరు చేయని పక్షంలో పోలీసులు తీసుకునే కఠిన చర్యలను ప్రయోగాత్మకంగా చేసిచూపారు. ఇదిలాఉండగా ఒకపక్క ఆందోళనకారులు పెద్దఎత్తున చేసిన నినాదాలు, దిష్టిబొమ్మ దహనం, మరోపక్క పోలీసులు మోహరించి నిరసనకారులను అక్కడి నుంచి వెళ్లిపోవాలని మైక్‌లో హెచ్చరికలు, ఫైర్ ఇంజిన్‌తో ఆందోళనకారులపై నీళ్లు చిమ్మడం ఈ చర్యలను చూసి నిజమనుకున్న ప్రజలు ఒకింత ఆందోళన చెందారు. అయితే మాబ్ డ్రిల్‌లో భాగంగా ఇదంతా పోలీసులే చేశారన్న విషయాన్ని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు.

### పేదలకు అన్నదానం

తాళ్లపూడి: దేవోక్తి చిడిపి సోషల్ సర్వీసు ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం చేశారు. తాళ్లపూడికి చెందిన బాలాజీ ఎలక్ట్రికల్స్ యజమాని రావులపాటి అనిత శ్రీనివాస రావు కుమార్తె మేఘన పుట్టినరోజు సందర్భంగా కొవ్వూరు గోష్పాద క్షేత్రం వద్ద, రాజమహేంద్రవరం పుష్కర్ ఘాట్ వద్ద గల 50 మంది పేదలకు భోజనాలు అందించారు. ఈ కార్యక్రమంలో దేవోక్తి చిడిపి సోషల్ సర్వీసు ప్రతినిధులు సాధనాల కిషోర్, ప్రత్తిపాటి అబెద్నెగో పాల్గొన్నారు.

## భయపెట్టిన భానుడు.. సేదతీర్చిన వరుణుడు



సీతానగరం బస్టాండ్ సెంటర్‌లో ఉదయం 11 గంటలకు ఎండ తీవ్రత



సాయంత్రం రాజానగరంలో మబ్బులతో నిండిన ఆకాశం

రంగంపేట: అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో శుక్రవారం విచిత్ర వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి భానుడు నిప్పులు కురిపించి బెంబేలెత్తించాడు. సాయంత్రం వరుణుడు వర్షంతో సేదతీర్చాడు. ఉదయం ఎండకు అల్లాడిపోయిన ప్రజలు సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. రంగంపేట మండలంలో ఉదయం వేళ ఎండ సెగలు పుట్టిస్తే, సాయంత్రానికి వాతావరణం చల్లబడింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. విద్యుత్తుకు అంతరాయం ఏర్పడింది. ఈ వాన పామాయిల్, జీడి మామిడి, నిమ్మ తోటలతో పాటు కూరగాయ పంటలకు మేలు చేకూర్చుతుందని రైతులంటున్నారు.

**చల్లబడిన వాతావరణం**

రాజానగరం: మండుతున్న ఎండలు, విపరీతమైన ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరవుతున్న జనానికి శుక్రవారం సాయంత్రం కురిసిన కొద్దిపాటి వర్షం ఉపశమనాన్ని కలిగించింది. ఈదురు గాలులతో కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడి, ఉక్కబోత తగ్గింది. మబ్బులతో నిండిన ఆకాశం ఆహ్లాదాన్ని కలిగించింది.



రంగంపేటలో కురుస్తున్న వర్షం

**నేలరాలిన మామిడి కాయలు**

మధురపూడి: వాతావరణంలో వచ్చిన మార్పులతో శుక్రవారం వీచిన ఈదురు గాలులకు మామిడి కాయలు నేలరాలాయి. గుమ్ములూరు. మధురపూడి, కోటి కేశవరం, నర్సాపురం, గాదరాడ, కణుపూరు తదితర గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంది. కోరుకొండ మండలంలో 1,646.46 హెక్టార్ల విస్తీర్ణంలో మామిడి తోటలున్నాయి. ప్రస్తుతం దిగుబడి అంతంతమాత్రంగానే ఉండడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోటు ఈదురుగాలులు మరింత నష్టాన్ని కలిగిస్తున్నాయి.

**ఉపశమనం**

సీతానగరం: మండలంలో ఉదయం ఎండ విజృంభించింది. సాయంత్రం మబ్బులు పట్టి ఆహ్లాదం కలిగించింది. ఎండల తీవ్రత మధ్యాహ్నం 11 గంటల తర్వాత రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ప్రజలందరూ ఇళ్ల నుంచి బయటకు రాలేదు. సాయంత్రం మబ్బులు పట్టడంతో వేడి తగ్గి ఉపశమనం కలిగింది.

## రమణీయంగా వెంకన్న కల్యాణం



జి.మామిడాడ వెంకన్న కల్యాణంలో ముత్యాల తలంబ్రాలు భక్తులకు చూపిస్తున్న అర్చకుడు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో ప్రసిద్ధి చెందిన అలివేలు మంగ, పద్మావతీ సమేత వేంకటేశ్వరుని ఆలయంలో స్వామివారి కల్యాణం గురువారం రాత్రి ఘనంగా జరిగింది. వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ కనుల పండువగా ఈ వేడుక నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు నల్లమిల్లి పద్మనాభ సత్యనారాయణరెడ్డి మల్లిక, నల్లమిల్లి మోహన్ రామగంగాధర్‌రెడ్డి అనంతలక్ష్మి దంపతులు కల్యాణంలో కూర్చున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు అరవెల్లి రఘురామాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణ క్రతువు నిర్వహించారు. వ్యాపారవేత్త డీఆర్‌కే రెడ్డి, వైద్యుడు బి.సూర్యారావు కుటుంబ సభ్యులు పట్టువస్త్రాలు సమర్పించారు. కల్యాణంలో స్థానిక సూక్ష్మ కళాకారుడు, వ్యాయామ ఉపాధ్యాయుడు ద్వారంపూడి యువరాజారెడ్డి వివిధ రంగులతో తయారు చేసిన కల్యాణ కొబ్బరి బొండాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మంచి ముత్యాలు కల్యాణ తలంబ్రాలుగా వినియోగించారు. కల్యాణాన్ని భక్తులు తిలకించి పులకించారు. కార్యక్రమంలో మల్లిడి శ్రీనివాసారెడ్డి, మల్లిడి వెంకట బొజ్జియ్యరెడ్డి, కె.అప్పారెడ్డి, ద్వారంపూడి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**బూరుగుపూడిలో..**

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి ఊరచెరువు వద్ద గల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం, బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త అనంతాత్తుల బాలాజీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి శ్రీదేవీ, భూదేవి అమ్మవార్లతో స్వామివారి కల్యాణం వైభవంగా జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన చేశారు. శనివారం వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త అనంతాత్తుల బాలాజీ, ఉష దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

## జాన్ రాజ్ మృతి వైఎస్సార్ సీపీకి తీరని లోటు

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- కుటుంబ సభ్యులకు పరామర్శ

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ నాయకుడు కుడిపూడి జాన్ రాజ్ మృతి పార్టీకి తీరని లోటని రాష్ట్ర బీసీ, సమాచార, పౌర సరఫరాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. ఆయన గురువారం ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులురెడ్డితో కలిసి బొమ్మూరు జేఎల్‌బీ నగర్‌లోని జాన్ రాజ్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా జాన్ రాజ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందని, అధైర్య పడవద్దని ఆయన భరోసా కల్పించారు. గొందేశి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ పార్టీకి జాన్ రాజ్ చేసిన సేవలు మరువలేనివన్నారు. పార్టీ నాయకులు మరడాపు శేఖర్, కాకులపాటి కుమార్, కటికల జగదీష్, కేతా గిరి, సునీల్, పిట్టా లోకేష్ రెడ్డి, సీతారామ్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

### ఖాతాదారులకు మెరుగైన సేవలు

రాజమహేంద్రవరం సిటీ: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా ఖాతాదారులకు విద్య, వాహనం, గృహ నిర్మాణం, పర్సనల్ రుణాలను అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని ఆ బ్యాంక్ రీజినల్ హెడ్ ఎ.విశ్వేశ్వరరావు తెలిపారు. స్థానిక జాంపేటలోని ఉమా రామలింగేశ్వరస్వామి కల్యాణ మండపంలో శుక్రవారం మెగా రిటైల్ ఎక్స్‌పో గ్రాండ్ నిర్వహించారు.

### బీజేపీ నాయకుల నిరసన

రాజమహేంద్రవరం సిటీ: ఓబీసీ సర్టిఫికెట్ల విషయంలో పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కోల్‌కతా హైకోర్టు తీర్పును వ్యతిరేకిస్తాననే ప్రకటన రాజ్యాంగ విరుద్ధమని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపీ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కురగంటి సతీష్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం గోదావరి గట్టు వద్ద గల మహాత్మా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మమతా బెనర్జీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో యెనుమల రంగబాబు, పిల్లాడి రుద్రయ్య, మన్యం శ్రీనివాస్, యానాపు ఏసు పాల్గొన్నారు.

# గ్రంథాలయాలు.. విజ్ఞాన కేంద్రాలు

- ఉత్సాహంగా వేసవి శిక్షణ తరగతులు
- ఆసక్తి చూపుతున్న విద్యార్థులు



దానవాయిపేట మహిళా గ్రంథాలయంలో చిన్నారులు

ప్రకాశం నగర్: వేసవి సెలవుల్లో పిల్లలు ఆటపాటలతో సమయం గడిపేందుకే ఇష్టపడతారు. ఏడాది పొడవునా చదువులతో కుస్తీలు పట్టిన వారికి వేసవి సెలవులు ఉపశమనం కలిగిస్తాయి. అయితే వారికి సెలవులలో ఆటపాటలతో పాటు విజ్ఞానం కూడా అందజేయాలి. తరగతిలో చెప్పే చదువులకు భిన్నంగా వివిధ అంశాలను తెలియజేయాలి. అందుకోసం ప్రభుత్వం గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తోంది.

**వేసవి శిక్షణ తరగతులు**

ఏపీ పౌర గ్రంథాలయ శాఖ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోని గౌతమీ ప్రాంతీయ గ్రంథాలయం, సీతంపేట గ్రంథాలయం, దానవాయిపేట మహిళా గ్రంథాలయాల్లో ఈనెల 15వ తేదీ నుంచి వేసవి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. జూన్ ఏడో తేదీ వరకూ దాదాపు 24 రోజుల పాటు వీటిని నిర్వహిస్తారు. వీటిలో భాగంగా చిన్నారులకు తెలుగు పద్యాలు, చిత్రలేఖనం, చందమామ కథలు, శతక పద్యాలు, గణిత సూత్రాలు, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ గ్రామర్‌పై శిక్షణ ఇస్తున్నారు. అలాగే వారంతపు పరీక్షలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేసి ప్రోత్సహిస్తున్నారు.

**పుస్తకం పఠనంతో ఎంతో లాభం**

ప్రస్తుతం టెక్నాలజీ బాగా పెరిగిన నేపథ్యంలో స్మార్ట్ ఫోన్ల వినియోగం పెరిగింది. ప్రతి ఒక్కరి దగ్గరా ఇవి తప్పనిసరిగా ఉంటున్నాయి. వీటి ద్వారా విజ్ఞానం పెంచుకోవచ్చు. చదువుకు సంబంధించిన అనేక విషయాలు తెలుసుకోవచ్చు. కానీ చాలామంది పిల్లలు వీటిలో ఆన్‌లైన్ గేమ్‌లు ఆడుతున్నారు. ఇది విపరీతంగా పెరిగిపోయి వ్యసనంలా మారింది. ప్రతి ఇంటిలో ఉండే ఒక పెద్ద సమస్యలా తయారైంది. ఆ అలవాటును మార్పించడానికి తల్లిదండ్రులు చాలా అవస్థలు పడుతున్నారు. గ్రంథాలయ శిక్షణ శిబిరాలతో విద్యార్థులకు పుస్తకాలపై ఆసక్తి కలుగుతుంది. చదవడం నేర్చుకుంటారు. విజ్ఞానాన్ని పెంచుకుంటారు. అదే సమయంలో స్మార్ట్ ఫోన్ కు దూరంగా ఉంటారు.

**ఉత్సాహంగా వస్తున్న పిల్లలు**

వేసవి శిక్షణ శిబిరాలకు రావడానికి విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. దీని వెనుక తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉంది. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సుమారు నాలుగు గంటల పాటు శిక్షణ జరుగుతుంది. వేద గణితం, పేపర్‌తో క్రాఫ్ట్ బొమ్మల తయారీ వంటి పలు అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థుల్లో చదువు ఒత్తిడిని దూరం చేసేందుకు యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. వారి జనరల్ నాలెడ్జ్ పెంచేందుకు ప్రముఖుల జీవిత చరిత్రలను వివరిస్తున్నారు. పుస్తక పఠనంపై ఆసక్తిని పెంచేలా ఒక మంచి పుస్తకంపై సమీక్ష చేయిస్తున్నారు. పెన్ను, పేపర్ లేకుండా సులువైన పద్ధతిలో లెక్కలలో మెళకువలు నేర్పుతున్నారు.

**పోటీతత్వం పెరుగుతోంది**

గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ తరగతులపై విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. చదువుతో పాటు ఇతర అంశాల్లో ఇస్తున్న శిక్షణ కారణంగా వారిలో సృజనాత్మకత, పోటీతత్వం పెరుగుతుంది. గణిత సూత్రాలు, స్పోకెన్ ఇంగ్లిష్ వంటివి నేర్చుకోవడం వల్ల పోటీ పరీక్షలలో సులభంగా విజయం సాధించవచ్చు.

– అబ్బిరెడ్డి చంద్ర పద్మాదేవి, దానవాయిపేట మహిళా గ్రంథాలయాధికారి